క్లుప్తంగా

నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు



పెనుగంచిప్రోలు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం ఆల్ ఇండియా డిమాండ్స్ డేను పురస్కరించుకుని ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు నల్లబ్యాడ్జీలు ధరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘాలకు ఆర్థిక చేయూతనివ్వాలన్నారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న హెచ్ ఆర్ పాలసీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రోజువారి వేతనం కింద పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సహకార సంఘ ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. తమ న్యాయమైన సమస్యలను తక్షణం పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా పీఏసీఎస్ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి ఎస్.కొండలుశర్మ, సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు



జగ్గయ్యపేట: మెడికల్ దుకాణాల్లో తప్పనిసరిగా ఫార్మసిస్టు అందుబాటులో ఉండాలని విజయవాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ ఆదేశించారు. పట్టణంలోని మూడు మెడికల్ షాపులను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ షాపులకు లైసెన్స్ ఉండాలని ఫార్మసిస్టు లేకుంటే చర్యలు తప్పవన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే మందులను విక్రయించాలని, ముఖ్యంగా రశీదులు సూచించారు. ఓ మెడికల్ షాపులో అమ్మకాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన వివరించారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు



కంచికచర్ల: గండేపల్లిలో తాగునీటి సమస్య లేకుండా రోజూ నీటిని సరఫరా చేస్తున్నట్లు సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. కీసర మున్నేటిపై ఏర్పాటు చేసిన బోరుకు శనివారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటి పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. గ్రామంలో నీటిసమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రైయినేజీల్లో మురుగునీటి పారుదల కోసం శానిటేషన్ పనులు చేపట్టామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆషాడమాస సారె కార్యక్రమం

నరసింహారావుపాలెం(వీరులపాడు): మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో వేంచేసియున్న అగస్త్యపీఠంలో ఆదివారం ఆషాడమాస గాయత్రిదేవి సారె కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ శనివారం తెలిపారు. అగస్త్యపీఠంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పెంపుడు కుక్కలకు టీకాలు



చిల్లకల్లు(జగ్గయ్యపేట): పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలను తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి ప్రసన్న సూచించారు. ప్రపంచ జోనోసిన్ డే సందర్భంగా పశువైద్యశాలలో శనివారం గ్రామాల్లోని పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పెంపుడు కుక్కల సంరక్షణను యజమానులు తీసుకోవాలన్నారు. రేబిస్ అత్యంత ప్రమాదకర వ్యాధి అని, కుక్కలకు విధిగా టీకాలు వేయించాలన్నారు. ముఖ్యంగా ఈ వ్యాధికి చికిత్స లేదని కుక్కల యజమానులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశువైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి



పేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, నాయకులు



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న మాజీ విప్ సామినేని ఉదయభాను, నాయకులు



నందిగామలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



పరిటాలలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీకర జీవరాజు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాల సాధనకు ముందుకు సాగుదామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే తాతయ్య పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 33ఏళ్లకు పైగా కేంద్రమంత్రి, ఉపప్రధానమంత్రిగా జగ్జీవన్‌రామ్ తీసుకున్న అసంఖ్యాక నిర్ణయాలు దేశాభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయన్నారు. అసమానతలులేని స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం జగ్జీవన్‌రామ్ విశేషంగా సేవలందించారని కొనియాడారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన వారిలో టీడీపీ, ఎస్సీ సెల్ నాయకులు ఉన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు ఆదర్శప్రాయం..

దళితులు గర్వించే మహానేత బాబూ జగ్జీవన్‌రామ్ అని, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎనలేని సేవలందించారని మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కొనియాడారు. భారత ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ ఉపప్రధానిగా, దళిత నాయకునిగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కోసం, నోడల్ ఏజెన్సీ కోసం జగ్జీవన్‌రామ్ విశేషంగా కృషిచేశారన్నారు. సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు ఆయన చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన వారిలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా), మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్ పందుల రోశయ్య, న్యాయవాది బూడిద నరసింహారావు, పార్టీ నాయకులు ఫిరోజ్‌ఖాన్, బద్దూనాయక్, చెరుకుమల్లి రాంబాబు, అన్నెపాగ నరసింహారావు, కఠారి హరిబాబు, అల్లూరి భాస్కర్, గోగుల వెంకయ్య, మల్లెల సాయి, వేముల విజయ్, ఉప్పెల్లి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామ: దేశ తొలి ఉపప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నందిగామ డివిజన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని జగ్జీవన్‌రామ్ విగ్రహాల తోపాటు చిత్రపటాలకు నాయకులు, ప్రజలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎక్కిరాల హనుమంతరావు, జి.రామారావు, కాట్ర సత్యనారాయణ, మట్టా ప్రసాద్, బొందలపాటి రామకృష్ణ, మన్నెం నారాయణరావు, బి. భాస్కరరావు, కొమ్మినేని మహేశ్వరరావు, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు. అదేవిధంగా బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని సమితి కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పత్తిపాటి సూర్యం, యర్రగొర్ల రామారావు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : దళిత, బలహీన, పేదవర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేసిన ఆదర్శమూర్తి మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అని అరుంధతీయ సేవా సమితి రాష్ట్ర కన్వీనర్ వేముల శ్రీకర జీవరాజు అన్నారు. మండలంలోని పరిటాల గ్రామ సచివాయం వద్ద ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి శనివారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, సంస్కరణల కోసం పదవులను కూడా త్యాగం చేసిన మహానీయుడన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషిచేసిన జగ్జీవన్‌రామ్ దేశ ప్రజానీకం గుండెల్లో సజీవంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మార్త శ్రీనివాసరావు, యద్దనపూడి సురేష్, ఆకుల కుటుంబరావు, మేడా దుర్గారావు, వీర్ల జాన్‌బాబు, జిక్కుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: ఉపప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్ ఎనలేని సేవలందించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు కొనియాడారు. మండలంలోని పెద్దాపురం, అల్లూరు, నరసింహారావుపాలెం, జుజ్జూరు తదితర గ్రామాల్లో శనివారం మాజీప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని సూచించారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన వారిలో సర్పంచులు నిప్పులపల్లి శాంతమ్మ, బొమ్మిశెట్టి దుర్గాదేవి, రమావత్ కోటి, మాజీ సర్పంచి ఆవుల మాధవి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా



డయేరియా బాధితురాలికి చికిత్స అందిస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్, సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా కేసులు తగ్గాయి. ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లుగా ఉన్న ఏడుగురిలో ఐదుగురు శుక్రవారం రాత్రి డిశ్చార్జి కాగా, మండలంలోని షేర్‌మహ్మద్‌పేట నుంచి కట్టమూరి లక్ష్మీనరసమ్మ వాంతులు, విరేచనాలతో బాధపడుతూ శనివారం జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో చేరగా, ఇద్దరు పేషంట్లు డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం డయేరియాతో బాధపడుతూ లక్ష్మీనరసమ్మ ఒక్కరే ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డయేరియా బాధితులను డీఐవో(డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్) అమృత పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా ఉధృతి పూర్తిగా తగ్గిపోయిందన్నారు. సోమవారం నాటికి మిగిలిన ఒక్క పేషంట్‌కు కూడా స్వస్థత చేకూరి డిశ్చార్జి అవుతారని ఆశిస్తున్నామన్నారు. పేట ప్రభుత్వాస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ ఎ.హరీష్, బూచవరం పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ వాసంతి, టీబీ, ఎఫ్‌బీటీ అధికారి రమేష్, మూడు మండలాల పీహెచ్‌సీల వైద్యబృందం పాల్గొని వైద్య సేవలందిస్తున్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందజేయాలి: ఆర్డీవో



విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న నందిగామ ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించడంతోపాటు పరిసర ప్రాంతాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావు సూచించారు. నందిగామలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వివరాలు, మెనుకు సంబంధించిన అంశాలపై ఉపాధ్యాయులతో మాట్లాడడంతో పాటు రికార్డులను పరిశీలించారు.అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని వడ్డించాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలం నేపథ్యంలో ఆహార పదార్థాలను పరిశుభ్రమైన ప్రదేశంలో తయారు చేసేలా చూడాలన్నారు. పరిసరాలు సైతం తప్పనిసరిగా శుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు.

పేటలో ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు



జగ్గయ్యపేటలో పొక్లెయిన్ సాయంతో సాగుతున్న పారిశుద్ధ్య చర్యలు



మురుగుకాల్వలో చెత్తచెదారాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



పేటలో ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు తమ ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. నాగమల్లేశ్వరరావు సూచించారు. పేటలో డయేరియా కేసులు నమోదవుతుండటంతో మున్సిపల్ అధికారులు పట్టణంలో ముమ్మర పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. డ్రెయిన్లలో పూడికతీత తొలగింపుతోపాటు ఫాగింగ్ చేపట్టారు. పొక్లెయిన్ సాయంతో మురుగుకాల్వలపై ఉన్న స్లాబులను సైతం తొలగించి పూడికతీత పనులు చేపట్టగా ఆయా పనులను కమిషనర్ శనివారం పర్యవేక్షించారు. ఈసందర్భంగా కమిషనర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రజారోగ్యం దృష్ట్యా పట్టణంలో మేజర్, మైనర్ కాలువుల్లో యుద్ధప్రతిపదికన పూడికతీత పనులు చేపట్టినట్లు వివరించారు. ఆయా ప్రాంతాల్లో మురుగుకాల్వలపై అనధికారికంగా ఏర్పాటు చేసిన శ్లాబులను తొలగించే విషయంలో కొందరు ఇళ్ల యజమానులు, పారిశుద్ధ్య సిబ్బందితో వాగ్వాదాలకు దిగుతున్నారని, ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా తొలగించి పారిశుద్ధ్యం మెరుగునకు సహకరించాలని పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్యం దృష్ట్యా ఆయా దుకాణాలవారు కూడా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సచివాలయాల శానిటరీ సెక్రటరీలు పర్యవేక్షించారు.

ఘనంగా ధోని బర్త్‌డే వేడుకలు



నందిగామ: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని బర్త్ డే వేడుకలను శనివారం నందిగామలో ఘనంగా నిర్వహించారు. ధోని బర్త్ డేను పురస్కరించుకుని అభిమానులు నందిగామలో 100 అడుగుల కటౌట్ ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన ధోని అభిమానులు అంబారుపేట వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఈ భారీ కటౌట్‌ను చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ కటౌట్‌ను నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆవిష్కరించారు. అనంతరం అభిమానులతో కలిసి ధోని బర్త్‌డే కేక్‌ను ఎమ్మెల్యే కట్‌చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కంచికచర్ల: కృష్ణానది, మున్నేరు ఉపనదుల్లో ఇసుకను తవ్వి అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పెంకె వెంకట సత్య సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని మోగులూరు మున్నేరులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలించరాదన్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

మృతదేహం అప్పగింత

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలు మునేరు కాజ్‌వే కింద శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బాపట్ల జిల్లా చినగంజాం మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన కంపిరి అనిల్‌నాయుడు మృతదేహాన్ని శనివారం పోస్టుమార్టమ్ అనంతరం పోలీసులు ఆయన కుటుంబసభ్యులకు అప్పగించారు. తమ కుమారుడు హోటల్‌మేనేజ్‌మెంట్ చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడని, ఈనెల 4న హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడని అనిల్‌కుమార్ కుటుంబసభ్యులు తెలిపారు. అనుమానాస్పదస్థితిలో అనిల్ మృతి చెందాడని సోషల్‌మీడియాలో చూసి వచ్చామని, తమ కుమారుడిని గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి చంపారని మృతుడి తండ్రి సురేష్‌కుమార్ పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జగ్గయ్యపేట సీఐ జానకిరాం ఆధ్వర్యంలో సర్కిల్ ఎస్ఐలు నాలుగు బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తిపై కత్తితో దాడి

జగ్గయ్యపేట: వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన పట్టణంలో శనివారం రాత్రి జరిగింది. స్థానిక చాకలి బజారుకు చెందిన కారంగుల సాయి, ఉప్పుతోళ్ల అశోక్‌లు స్నేహితులు. ఈ క్రమంలో మాటమాట పెరిగి సాయిని, అశోక్ కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సాయిని జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ పద్మారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విత్తనాల షాపుల్లో తనిఖీలు



విత్తనాల షాపులో తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారులు

వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయిలోని విత్తనాల షాపులను అగ్రికల్చరల్ డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రబాబు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పెంచల్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. . ఈ సందర్భంగా స్టాకు రిజిస్ట్రార్, షాపులో ఉన్న సరుకు వివరాలను సరిపోల్చి చూశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే రైతులకు విత్తనాలు అమ్మాలని డీలర్లను ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా డీలర్ల వద్ద నుంచి విత్తనాలకు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రశీదులు తీసుకోవాలన్నారు. తీసుకున్న రశీదులను పంట పూర్తయ్యేవరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. తనిఖీల్లో జగ్గయ్యపేట ఏడీఏ సి.భవాని, ఏవో వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం



నీటిసరఫరా వివరాల రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

నందిగామ: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశించారు. నందిగామ పట్టణ పరిధిలోని ప్రజలకు తాగునీరు సరఫరాచేసే రిజర్వాయర్లు, సంప్‌లను శనివారం ఆమె పరిశీలించారు. తాగునీటి సరఫరాపై మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా విషయంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని, ఏఈ ఫణి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ అమలు ఆపాలి : సీఐటీయూ



కరపత్రం ఆవిష్కరిస్తున్న కమల, నాగేశ్వరరావు తదితరులు

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత చేపడుతున్న రాజకీయ తొలగింపులను వెంటనే ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కమల డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే లేబర్ కోడ్ అమలు నిలుపుదల, కార్మికుల హక్కులను కాపాడాలని కోరుతూ ఈనెల 10వతేదీన నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కరపత్రం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథక వంట ఏజెన్సీ వారు, వీఓఏల స్థానంలో కొత్త వారిని నియమించేందుకు టీడీపీ రాజకీయ తొలగింపులు చేపట్టడం సరికాదన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని నిలుపుదల చేయించాలని కోరారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ, ఆయా ఫ్యాక్టరీల యజమానులకు తొత్తుగా ఉంటూ అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్ అమలు చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. లేబర్ కోడ్ అమలు జరిగితే కార్మికులు అనేక విధాలుగా నష్టపోతారని ఆందోళన వ్యక్తంచేశారు. ఆయా డిమాండ్ల సాధన కోసం ఈనెల 10వతేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాలో అందరూ పాల్గొనాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.గోపాలరావు, మధ్యాహ్న భోజన పథక ఏజెన్సీ నిర్వాహకులు కె.రాణి, బి.వరలక్ష్మి, సీహెచ్ బాలాజీ, జానకి తదితరులు పాల్గొన్నారు.

బూదవాడ వైద్యశిబిరం సందర్శన



బూదవాడ పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఐవో డాక్టర్ అమృత

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామాల్లో డయేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో తాగునీటిని సరఫరా చేసే సమయంలో పంచాయతీ అధికారులు నీటిని తప్పకుండా క్లోరినేషన్ చేయాలని డీఐవో డాక్టర్ అమృత సూచించారు. బూదవాడలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమృత మాట్లాడుతూ తాగునీరు కలుషితం కావడమే డయేరియా రావడానికి కారణమన్నారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు. కొన్ని గ్రామాలలో డ్రైన్‌లలోనే తాగునీటి పంపులుండటాన్ని వైద్య సిబ్బంది గుర్తించారని, అటువంటి పైపులైన్‌లను పంచాయతీ అధికారులు మార్చాలన్నారు.అనంతరం ఆమె షేర్‌మహ్మద్‌పేట గ్రామంలోని తాగునీటి బావిని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అనిల్‌కుమార్, స్రవంతి, సూపర్‌వైజర్ వెంకట్రావ్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరం



విద్యార్థి నాయకులతో డీసీపీ చక్రవర్తి, ప్రిన్సిపాల్ మాదల పద్మజ

లబ్బీపేట(విజయవాడతూర్పు):చదువులోనైనా, ఆటల్లోనైనా క్రమశిక్షణకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉండాలని ట్రాఫిక్ వింగ్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.చక్రవర్తి అన్నారు. నలంద విద్యానికేతన్‌లో శనివారం విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి ఎన్నికైన ప్రైమరీ, సెకండరీ విద్యార్థినీ, విద్యార్థి నాయకులకు డీసీపీ చక్రవర్తి బ్యాడ్జీలు ధరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తకాలు చదవటంపై ఆసక్తి చూపాలని, మహా నాయకుల ఆత్మకథలను చదివి, వారు జీవితంలో సాధించిన విజయాలను, ఆదర్శాలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు బాల్యం నుంచి ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణను పాటిస్తూ, అందరినీ ఒక తాటిపై నడిపించే ఉత్తమ నాయకులు అవ్వాలని ఆకాంక్షించారు. స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ.. అంకితభావం, సహకారం లాంటి గుణాలను మనసులో నింపుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చెస్ ఫిడే రేటింగ్‌లో ప్రతిభ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమవరంలో జరిగిన చెస్ టోర్నమెంట్‌లో చరణ్‌చంద్ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ సాధించాడని శ్రీగౌతమ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ నల్లాని సూర్యారావు, చెస్ కోచ్ రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెస్‌లో ప్రతిభ కనబర్చిన చరణ్‌చంద్‌ను ప్రిన్సిపాల్, కోచ్‌లు అభినందించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ గత నెలలో భీమవరంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌లో చరణ్‌చంద్ పాల్గొని నాలుగు రౌండ్స్‌లో ప్రతిభ చూపాడన్నారు. నాలుగు రౌండ్స్‌లో మొత్తం 1510 రేటింగ్ సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం చరణ్‌చంద్‌ను ప్రిన్సిపాల్ తులసీ శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.